నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 25 నవంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

- ఆటో ఎక్స్‌పోలతో కంపెనీలు, కస్టమర్లకు ప్రయోజనం
- నగరంలో ఇలాంటి నూతన ఒరవడి అద్భుతం
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- ఖమ్మంలో ముగిసిన నమస్తే తెలంగాణ 'ఆటో షో'

'నమస్తే తెలంగాణ' కృషి ప్రశంసనీయం

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 24: తెలంగాణ ఆవిర్భావానికి ముందు, ఆ తరువాత 'నమస్తే తెలంగాణ' దినపత్రిక వివిధ రూపాల్లో రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తున్న తీరు ప్రశంసనీయమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. ఖమ్మం లోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఏర్పాటుచేసిన ఆటో షో ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఎక్స్‌పోలోని వివిధ కంపెనీల స్టాళ్లను పరిశీలించారు. ఆయా మోడళ్ల వాహనాల వద్దకు వెళ్లి వాటి ఫీచర్ల గురించి వాకబు చేశారు. పలు బైకులను టెస్ట్ రైడ్ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయా సంస్థల ప్రతినిధులను, నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో ఆటో, ప్రాపర్టీ షోలతో నూతన ఒరవడిని తీసుకొచ్చిన ఘనత నమస్తే తెలంగాణకే దక్కుతుందని అన్నారు. ఇలాంటి షోల ద్వారా అటు కంపెనీల బాధ్యులకు, ఇటు వినియోగదారులకు మేలు జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా ఒకే వేదికపై అనేక సంస్థలు ఉండడం వల్ల వినియోగదారులు అన్ని స్టాళ్లను సందర్శించి వాటి బాధ్యులను సంప్రదించి వాహనాలను కొనుగోలు చేసేందుకు వీలు కలుగుతుందని వివరించారు. అనంతరం నమస్తే తెలంగాణ బ్యూరో ఇన్‌చార్జి మాటేటి వేణుగోపాల్, టీ న్యూస్ జిల్లా ప్రతినిధి సాంబశివరావు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఆటో షోకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ అనేక కార్యక్రమాలు చేపట్టి అటు ప్రజలకు, ఇటు కంపెనీలకు అనుసంధానకర్తలుగా వ్యవహరించేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఆయా సంస్థల ప్రతినిధులకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మెమెంటోలు అందజేశారు. శాలువాలతో వారిని సత్కరించారు. మాజీ కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆటో షో ముగింపు సందర్భంగా కెనరా బ్యాంక్ మేనేజర్‌కు మెమెంటో అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, చిత్రంలో బ్యూరో ఇన్‌చార్జి వేణుగోపాల్, యాడ్స్ డిప్యూటీ మేనేజర్ శేఖర్‌బాబు

స్టాల్‌లోని కారును పరిశీలిస్తున్న సందర్శకులు

టెస్ట్ రైడ్ చేస్తున్న వద్దిరాజు

ఆటో షో గ్రాండ్ సక్సెస్

- రెండు రోజులపాటు అట్టహాసంగా కొనసాగిన 'మేళా'
- ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసుల నుంచి అపూర్వ ఆదరణ
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేకు ప్రశంసలు

ఖమ్మం నగరంలోని ఆటో షోలో ఆఖరి గంట లక్కీ డిప్ విజేతకు బహుమతిని అందిస్తున్న నమస్తే తెలంగాణ బృందం

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 24: 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో ఖమ్మంలో ఏర్పాటుచేసిన 'ఆటో షో' గ్రాండ్ సక్సెస్ అయింది. రెండు రోజులపాటు కొనసాగిన వాహనాల ప్రదర్శన, విక్రయాల ఎక్స్‌పో ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు, వాహన వినియోగదారుల సౌకర్యార్థం ఇటు బహుళజాతి కంపెనీల కార్లు, బైకులను; అటు బ్యాంకర్లను ఒకే వేదిక పైకి తీసుకొచ్చే కార్యక్రమం కొన్నేళ్లుగా చేపడుతున్న విషయం విదితమే. దీంతో సదరు కంపెనీలకు సైతం మంచి ఆదరణ వస్తుండడంతో ఈ ఏడాది కూడా మరోమారు ఆటోషోను ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేశారు. మీడియా పార్టనర్‌గా టీ న్యూస్, డిజిటల్ పార్టనర్‌గా సుమన్ టీవీల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ మేళా ఆదివారం సాయంత్రంతో దిగ్విజయమైంది. ఖమ్మం నగరంలో రెండురోజుల పాటు కొనసాగిన ఈ ఎక్స్‌పోను అనేకమంది ప్రజలు, వాహన ప్రియులు సందర్శించారు. వారి అభిరుచులకు తగినట్లుగా వాహనాలను ఎంచుకున్నారు. వివిధ రకాల రుణాల కోసం మేళాలో ఏర్పాటైన ఎస్‌బీఐ, కెనరా, యూనియన్ బ్యాంకుల స్టాళ్లను వాహనదారులేగాక రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు కూడా సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పలు వాహనాలను బుక్ చేసుకొని బ్యాంకర్లను సంప్రదించారు. ఆధునిక నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మంలో మెట్రోపాలిటన్ సిటీల్లో ఏర్పాటు చేసే విధంగా ఆటో ఎక్స్‌పోను కొలువుదీర్చడం పట్ల సందర్శకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తొలి రోజు కార్యక్రమానికి కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతోపాటు అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు. రెండోరోజు ముగింపు కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సహా మరికొందరు ప్రముఖులు పాల్గొన్నారు. వివిధ కంపెనీల స్టాళ్ల యజమానులకు, నిర్వాహకులకు మెమెంటోలు అందజేశారు. ఆటో ఎక్స్‌పో ఏర్పాటుచేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. స్టాళ్లను సందర్శించిన ప్రతి ఒక్కరికీ కూపన్లు అందజేసిన నిర్వాహకులు.. ప్రతి గంటకూ ఒకసారి లక్కీ డిప్ తీశారు. విజేతలకు అక్కడే బహుమతులు అందజేశారు. దీంతో సందర్శకుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ ఖమ్మం బ్రాంచి మేనేజర్ రేనా రమేశ్, బ్యూరో ఇన్‌చార్జి మాటేటి వేణుగోపాల్, యాడ్స్ డిప్యూటీ మేనేజర్ బోయిన శేఖర్‌బాబు, సర్క్యులేషన్ మేనేజర్ రాంబాబు, యాడ్స్ ఆఫీసర్లు నాగరాజు సురేందర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్, సురేశ్, కరుణాకర్, దశరథ్, రిపోర్టర్లు శీలం శ్రీనివాస్, మద్దెల లక్ష్మణ్, గోపాల్‌రావు, పూనాటి మనోజ్, శ్రీనివాసరావు, బ్రహ్మం, సర్క్యులేషన్ సిబ్బంది టీ.భద్రం, బీ.భిక్షంరెడ్డి, ఎన్.గోవిందచారి, సీహెచ్ శ్రీను, కే.గోపాల కృష్ణ, ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటో షో స్టాళ్లలో వాహనాలను పరిశీలిస్తున్న సందర్శకులు

లక్కీ డిప్ విజేతకు బహుమతి అందజేస్తున్న బ్యాంకుల ప్రతినిధులు

ముగింపు కార్యక్రమానికి హాజరైన సందర్శకులు, సంస్థల ప్రతినిధులు

ఆటో ఎక్స్‌పోలతో అద్భుత అవకాశం

ఆటో ఎక్స్‌పోలతో వినియోగదారులకు అన్ని రకాల వాహనాలపై మంచి అవగాహన కలుగుతుంది. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే చేసిన ఈ ప్రయత్నం హర్షణీయం. ఇలాంటి వేదికలు ముమ్ముందు మరిన్ని ఏర్పాటు కావాలి. గ్రీన్‌హోండా అంటే వినియోగదారులకు చెప్పాల్సిన అవసరమే లేదు. దశాబ్దాల తరబడి మా షోరూంలలో వేలాది మంది వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చాం.

–రెడ్డిమళ్ల ఉపేందర్, సేల్స్ మేనేజర్, గ్రీన్‌హోండా

సేఫ్టీ, లగ్జరీకి టాటా మోటార్స్ ఎంతో అనుకూలం

టాటా కంపెనీ కార్లు అంటేనే ప్రయాణికులకు ఎంతో నమ్మకం. సేఫ్టీని ఇవ్వడంతో పాటు మంచి లగ్జరీగా ఉంటాయి. అన్ని రకాల ఫీచర్లు ప్రెజెంట్ మోడళ్లలో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి కలిగిన వినియోగదారులు గూగుల్‌లో సెర్చ్ చేసుకొని అయినా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువ వాహనాలు కొనుగోలు చేసేందుకు గాను వినియోగదారులు ఆసక్తి చూపితే స్వయంగా వాహనం తీసుకొచ్చి డెమో ఇస్తాం. రెండు రోజులపాటు జరిగిన ఈ ఎక్స్‌పోలో మా కంపెనీ కార్లకు మంచి ఆదరణ కన్పించింది.

–ఎన్.మనోజ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, టాటా మోటార్స్

'నమస్తే తెలంగాణ' ఆటో ఎక్స్‌పో భేష్

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే యాజమాన్యాలు ఏర్పాటు చేసిన ఆటో ఎక్స్‌పో ప్రదర్శన నిర్ణయం సంతోషించదగ్గ విషయం. వినియోగదారుల సౌలభ్యం కోసం ఒకేచోట వాహనాలు, రుణ సదుపాయం కల్పించే బ్యాంకులు ఉండడంతో వారికి మార్గం సుగమమైంది. మా సంస్థకు చెందిన వివిధ మోడళ్ల వాహనాలు అందుబాటులో ఉన్నాయి. రెండురోజుల పాటు సాగిన ఈ ఆటో ఎక్స్‌పోలో మా వాహనాల ప్రదర్శనకు మంచి ఆదరణ వచ్చింది. ఖమ్మం నగర పుర ప్రముఖులు మా కార్లను టెస్టు డ్రైవ్ చేసి ప్రశంసలు ఇచ్చారు. బుకింగ్‌లు కావడం సంతోషంగా ఉంది.

–బీ.నారాజు, ఏఎస్ఎం జీప్ కంపెనీ

వినియోగదారుల నమ్మకం.. కియా

వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన వాహనాలను అందించడమే కియా కంపెనీ ధ్యేయం. ఇప్పటికే మా కంపెనీ నుంచి విడుదలైన అనేక మోడళ్లకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ కన్పిస్తోంది. ఈ రెండు రోజులపాటు జరిగిన ఎక్స్‌పోలో మా స్టాల్‌ను సందర్శించిన ప్రతి వినియోగదారుడికీ ప్రత్యేక కృతజ్ఞతలు. 'నమస్తే తెలంగాణ' చేసిన ఈ ఆలోచన వేరీ హ్యాపీ. ఇలాంటి ప్రదర్శనలతో వినియోగదారులకు, కంపెనీలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

–ఎన్.మహేశ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, కియా ఆటోమోటివ్

వాహన ప్రదర్శనలతో వినియోగదారులకు మరింత చేరువ

ఖమ్మంలో ఏర్పాటుచేసిన ఈ ఆటో ఎక్స్‌పో ద్వారా అనేకమంది ప్రజలకు మా కంపెనీ మరింత చేరువైనట్లయింది. కటకం హోండా కంపెనీ వాహనాలకు మార్కెట్లో ఎంతో ప్రత్యేకత ఉంది. అందువల్లనే వివిధ వర్గాల ప్రజలు, అనేక మంది వ్యాపారులు మా స్టాల్‌ను సందర్శించారు. దీంతో రాబోయే రోజుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేకమంది నూతన కస్టమర్లను సొంతం చేసుకునేందుకు మార్గం సులువైంది.

–పీ.సతీశ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, కటకం హోండా

'హీరో' అంటేనే అన్ని వర్గాలకు సుపరిచితం

స్పార్క్ హీరో కంపెనీ అంటే తెలియని వారు ప్రస్తుత సమాజంలో ఎవరూ లేరు. నిత్యం వినియోగదారుల అభిరుచులు, వారి అభిప్రాయాలకు అనుగుణంగా నూతన మోడళ్లను మార్కెట్లోకి తీసుకొస్తున్నాం. పల్లెల నుంచి మొదలుకొని నగరాల వరకు ప్రతి ఒక్కరూ హీరో వాహనాలను దశాబ్దాల నుంచి ఆదరిస్తున్నారు. మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్లోకి సరికొత్త వాహనాలను కూడా మా కంపెనీ తీసుకొచ్చింది. మా షోరూముకు వచ్చిన కస్టమర్లకు మెరుగైన సేవలందించడమే మా కంపెనీ ప్రధాన లక్ష్యం. **–జీ.అనూప్, ఎండీ స్పార్క్‌హీరో**

ఇలాంటి వేదికలతోనే అవగాహన వస్తుంది

కొత్తగా కార్లు గానీ, ద్విచక్ర వాహనాలు గానీ కొనుగోలు చేయాలనుకునే వారికి ఇలాంటి మేళాలతో ఎంతో అవగాహన కలుగుతుంది. ఒకే దగ్గరికి వెళ్లి వాహనం కొనుక్కోవచ్చు. కానీ 'మార్కెట్లో ఎన్ని కంపెనీలు ఉన్నాయి? ఏయే మోడళ్లు అందుబాటులో ఉన్నాయి? వాటి ఫీచర్లు ఏంటి?' అనే వివరాలు తెలయవు కదా. ఈ రోజు ద్విచక్ర వాహనం కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో వచ్చాను. రెండు కంపెనీల వాళ్లను, బ్యాంకు వాళ్లను కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నాను. నాకున్న సందేహాలు నివృత్తి అయ్యాయి. 'నమస్తే తెలంగాణ' చేసిన ఈ ఆలోచన ఎంతో బాగుంది.

–ఏ.నర్సింహారావు, వేపకుంట్ల, సందర్శకుడు

ఎక్స్‌పోతో నగరవాసులకు ప్రయోజనం

హైదరాబాద్ తరహాలో ఆటోఎక్స్‌పోను ఖమ్మంలో ఏర్పాటు చేయడం నగరవాసులకు ఎంతో ప్రయోజనకరం. కారు కొనుక్కోవాలంటే నగరం తోపాటు ఖమ్మం రూరల్ పరిసర ప్రాంతాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. కానీ ఆటో ఎక్స్‌పో అని తెలయగానే కుటుంబంతో కలిసి వచ్చాను. ఈ రోజు అన్ని రకాల కంపెనీల స్టాళ్లు చూశాను. వాటి ధరలు, ఫీచర్లను ఆయా సంస్థల ప్రతినిధులు చక్కగా వివరించారు. ఎక్స్‌పోలో 'నమస్తే తెలంగాణ' నిపుణ గురించి కూడా వివరాలు తెలుసుకున్నాను. బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లి రుణ సదుపాయం వివరాలు తెలుసుకున్నాను. అవసరమైన వారి ఫోన్ నెంబర్లు నమోదు చేసుకున్నాను.

–గోపీనాథ్, టీచర్, ఖమ్మం నగరవాసి

విద్యార్థులు లక్ష్యంతో ముందుకుసాగాలి

భద్రాద్రి జిల్లా జడ్జి పాటిల్ వసంత్, కలెక్టర్ జితేశ్ పాటిల్

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్, జిల్లా జడ్జి వసంత్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 24: విద్యార్థులు ఒక లక్ష్యంతో జీవితంలో స్థిరపడేందుకు కృషిచేయాలని, తమకు ఇష్టమైన రంగాలను ఎంచుకొని ఆ దిశగా ముందుకు సాగాలని జిల్లా జడ్జి పాటిల్ వసంత్, కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ వసతిగృహ విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడోత్సవాల ముగింపు వేడుకల్లో వారు మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసమే కాకుండా సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని వివరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇందిర, వివిధ వసతి గృహాల సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వలస ఆదివాసీల సంక్షేమమే ధ్యేయం

మెగా వైద్య శిబిరం ప్రారంభంలో భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

వేములూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

అశ్వాపురం, నవంబర్ 24: మారుమూల గ్రామాల్లో వలస ఆదివాసీల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పోలీసు శాఖ పని చేస్తున్నదని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. అశ్వాపురం మండలంలోని గిరిజన మారుమూల గ్రామమైన వేములూరులో ఆదివాసీల ఆరోగ్య సంక్షేమం కోసం భద్రాచలం రోటరీ క్లబ్ సహకారంతో అశ్వాపురం పోలీసు శాఖ ఆదివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేములూరు, మనుబోతులగూడెం, మల్లయ్యగుంపు, గుండ్లమడుగు వలస గొత్తికోయ గ్రామాల ఆదివాసీల కోసం ఈ వైద్యశిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. మావోయిస్టుల సమాచారం తెలిస్తే పోలీసు శాఖకు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో కలిసి ఎస్పీ అక్కడ భోజనం చేశారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సైలు తిరుపతిరావు, రవూఫ్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బాలాజీ, వైద్యులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేలో డేటా ఎంట్రీ కీలకం

మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్

మామిళ్లగూడెం, నవంబర్ 24: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుందని, ఇందులో డేటా ఎంట్రీ చాలా కీలకమైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని సూచించారు. జార్ఖండ్ నుంచి కలెక్టర్లతో ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పట్టణాల్లో డోర్ లాక్ ఉండడం, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు వచ్చాయని అన్నారు. అలాంటి వారికి ఫోన్ చేసి అందుబాటులో ఉండమని కోరి సర్వే చేసుకోవాలని ఆదేశించారు. ఖమ్మం నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఖమ్మంలో 59.50 శాతం, పాలేరులో 93.64 శాతం, మధిరలో 94.41 శాతం, వైరాలో 96.98 శాతం, సత్తుపల్లిలో 98.09 శాతం చొప్పున జిల్లా వ్యాప్తంగా 84.23 శాతం సర్వేను పూర్తి చేశామని వివరించారు. పక్కాగా డేటా ఎంట్రీ నమోదు చేస్తున్నామని తెలిపారు.

దీక్షా దివస్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జిగా 'తక్కెళ్లపల్లి'

ఖమ్మం, నవంబర్ 24: ఈ నెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలకు పార్టీ అధిష్ఠానం ఇన్‌చార్జులను నియమించింది. ఈ మేరకు ఆ జాబితాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం వెల్లడించారు. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావును నియమించారు. దీక్షా దివస్ రోజున అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు.

నేడు సన్నాహక సమావేశం: రేగా

మణుగూరు టౌన్, నవంబర్ 24: ఈ నెల 29న బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్‌ను నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యే ఈ సమావేశానికి ముఖ్య నాయకులు తరలిరావాలని కోరారు.